వర్షానికి పొంగుతున్న డ్రైనేజీలు

● ప్రధాన దారుల్లో మురుగు.. పరుగు ● ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులు



జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద మురుగునీరు


బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుండపోత వర్షాలు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. రోడ్లపై వరదనీరు తగ్గి మురుగునీటి ప్రవాహం పెరిగింది. దుర్వాసనతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. మూడు రోజులు భారీ వర్షాలు బుధవారం కాస్త తగ్గాయి. హమ్మయ్య వరద నీరు తగ్గింది అనుకునేలోపు మురుగు రోడ్లపై పొంగి ప్రవహిస్తున్నాయి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు సమీపంలో నడిరోడ్డుపై డ్రైనేజీ పొంగి ఆ మురుగునీరు రోడ్డునంబర్.5 ఇందిరానగర్ వరకు ప్రవహిస్తుండడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. కొన్నిసార్లు ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఫిలింనగర్ రాజరాజేశ్వరి ఆలయం వద్ద కూడా డ్రైనేజీ పొంగుతుండడం వల్ల మురుగునీరు ప్రధాన రోడ్డంతా ప్రవహిస్తుండడంతో వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో నాలుగు చోట్ల డ్రైనేజీలు పొంగుతున్నాయి. మురుగునీటి నుంచే ఆలయానికి వెళ్లి దర్శించుకోవాల్సి వస్తుందని భక్తులు ఆరోపిస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునంబర్.45, రోడ్డు నంబర్.36, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్ చుట్టూ రోడ్లన్నీ మురుగు నీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారి పరిస్థితే కాదు అంతర్గత దారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కాలు తీసి కాలు పెట్టలేని విధంగా మురుగునీరు నిలుస్తుండడంతో ప్రజలు అనేక అగచాట్లకు గురవుతున్నారు.



జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై పొంగుతున్న డ్రైనేజీ



శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద డ్రైనేజీ లీకేజీ



జూబ్లీహిల్స్ రోడ్డునంబర్.45లో పారుతున్న మురుగునీరు

కళింగలో హ్యాండ్‌లూమ్ ఇండియా చేనేత ప్రదర్శన

బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్.12లోని కళింగ కల్చరల్‌హాల్లో ఏర్పాటైన హ్యాండ్‌లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం టాలీవుడ్ వర్ధమాన నటి సౌమ్యజాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. నేటితరం యువతలో కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు.



ఉత్పత్తులతో నటి సౌమ్యజాను



విద్యా శాఖ కార్యాలయం ముట్టడికి యత్నిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

కదం తొక్కిన కార్మికులు

● మధ్యాహ్న భోజన పథకాన్ని హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించవద్దని..

● 400 మందికి పైగా కార్మికులు అరెస్టు

ఖైరతాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఆ పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్టే అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దాదాపు 430 మంది కార్మికులను ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి, బోయిన్‌పల్లి, షాయ్‌నాత్‌గంజ్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లతో పాటు హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) అధ్యక్షురాలు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కార్మికులు 24 సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాలకోర్చి పని చేస్తుండగా ప్రస్తుతం వారందరి బతుకులు బజారున పడేలా ముఖ్యమంత్రి హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్‌కు మధ్యాహ్న భోజన పథకం మొత్తాన్ని అప్పగించేందుకు వారితో ఒప్పందం జరుపుకొనేందుకు సమాయత్తమయ్యారని ఆరోపించారు. గత ఎన్నికల వాగ్దానాల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెలా రూ.10 వేల వేతనం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

జేఎన్‌టీయూ డీఏఎఫ్ డైరెక్టర్‌గా ఎన్వీ రమణ

ఐక్యూఏసీ ఇన్‌చార్జిగా ఎంవీఎస్ గిరిధర్ నియామకం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అకాడమిక్ అండ్ అఫిలియేషన్స్(డీఏఎఫ్) డైరెక్టర్‌గా ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణ నియమితులయ్యారు. అలాగే, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం (ఐక్యూఏసీ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా వాటర్ రిసోర్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఎస్ గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వెంటనే అకాడమిక్ అఫిలియేషన్స్ విభాగం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఎన్వీ రమణ బాధ్యతలు స్వీకరించారు.

ఆయుర్వేద పీజీ స్టార్ ప్రోగ్రామ్‌కు కార్తికేయ ఎంపిక

ఎర్రగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద విభాగంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పీజీ స్టార్(స్కీం ఫర్ ట్రైనింగ్ ఇన్ ఆయుర్వేద రీసెర్చ్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్స్) ప్రోగ్రామ్‌కు ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ పోలా కార్తికేయ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి తెలిపారు. కళాశాలలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 1,769 దరఖాస్తులు అందాయని, అందులో కేవలం 100 మందిని మాత్రమే ఆయుర్వేద విభాగం ఎంపిక చేసిందన్నారు. అందులో డాక్టర్ పోలా కార్తికేయ ఎంపిక కావడం ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాలకు గర్వకారణమన్నారు. డాక్టర్ ఎస్.బాబురావు మార్గదర్శకత్వంలో డాక్టర్ కార్తికేయ సయాటికా వంటి నొప్పి సంబంధిత రోగాలకు శస్త్ర చికిత్స లేకుండా ఆయుర్వేద చికిత్సలను అభివృద్ధి చేయడంపై పరిశోధనలు చేస్తున్నారని పేర్కొన్నారు.



డాక్టర్ కార్తికేయ

'ఎమ్మెల్యే దానంపై కార్పొరేటర్ ఆరోపణలు తగదు'

బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ విషయంలో గిరిజనులకు న్యాయం చేయాల్సింది పోయి కొందరు రాజకీయం చేస్తున్నారని బస్తీ సంఘం అధ్యక్షుడు గోపాల్‌నాయక్ ఆరోపించారు. బస్తీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బస్తీలో పక్కా గృహాలు నిర్మించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు గుడిసెవాసులందరినీ ఒక్కటిగా ఉంచి కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బస్తీవాసులను విడదీసేందుకు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. రాజకీయ పెత్తనం కోసం తమ బస్తీలో చిచ్చు పెట్టవద్దని కోరారు. బస్తీ ఆవిర్భావం నుంచి దానం నాగేందర్ పక్కా గృహాల కోసం పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఆయనతోనే న్యాయం జరుగుతుందని తమకు నమ్మకం ఉందని పేర్కొన్నారు.

రేపటి నుంచి పెయింటింగ్స్ ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారిణి ఆశారాధిక కుంచె నుంచి జాలువారిన పెయింటింగ్స్‌ను నగరంలోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్యూరేటర్ అమన్‌ప్రీత్ కౌర్ ఆధ్వర్యంలో "ది మిస్టికల్ వింగ్స్ అండ్ ఎటర్నల్ టింకెల్స్" పేరుతో నాలుగు రోజులపాటు పెయింటింగ్స్‌ను ప్రదర్శించనున్నారు. ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు ప్రదర్శన ప్రారంభిస్తారని, 24 నుంచి 26వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



చెన్నై మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురు బారన్ నగరానికి వచ్చారు. జీహెచ్‌ఎంసీలో పారిశుధ్య నిర్వహణ, వైకుంఠ ధామాల నిర్మాణంపై అధ్యయనం కోసం వచ్చిన ఆయన పలు ప్రాంతాలను పర్యటించారు. సంజీవయ్యపార్కులోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్, జూబ్లీహిల్స్ మహాప్రస్థానం, ఇందిరాపార్కులో గ్రీనరీని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, వైకుంఠధామాలు బాగున్నాయని కితాబునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య

ఐఏఎస్, ఐపీఎస్ ప్రైవేటైజేషన్ దుర్మార్గం

● లేటరల్ ఎంట్రీ విధానాన్ని ఎత్తివేయాలి : ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడం దుర్మార్గమైన చర్య అని, ఈ విధానానికి మోదీ ప్రభుత్వం తక్షణమే స్వస్తి పలకాలని రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులగణనపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర కేబినెట్ లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా 45 మందిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో భర్తీ చేయాలని నిర్ణయించడం ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడమేనని ధ్వజమెత్తారు. ఈ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులు దక్కకుండా మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికే కేంద్రంలో 1,670 ఐఏఎస్, 1,482 ఐపీఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయకుండా దొడ్డిదారిన రాజకీయ కార్యకర్తలను భర్తీ చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగమే లేటరల్ ఎంట్రీ విధానం అని, దీన్ని ఎత్తివేయకపోతే దేశాన్ని స్తంభింపజేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సీఎంను తప్పుదోవ పట్టిస్తున్నారు'

పంజాగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాల్లో అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని, వర్గీకరణ లేకుండా నియామకాలు చేపట్టాలని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డిని తప్పుదారి పట్టిస్తూ మాదిగలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవని సతీష్ మాదిగ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

లవ్ హైదరాబాద్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

ఖైరతాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడ్డ నిందితులకు సుప్రీంకోర్టు కఠిన శిక్ష విధించి బహిరంగంగా అమలు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఆలిండియా పీస్ అండ్ సాలిడారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ ఫర్ అభయ పేరిట లవ్ హైదరాబాద్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. లోక్‌సత్తా, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, విద్యావంతుల వేదిక తదితతర సంస్థల ప్రతినిధులు అభయకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం నిర్భయ సంఘటన నుంచి దేశంలో వరుసగా ఏదో ఒకచోట ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లాస్య రాయుడు మాట్లాడుతూ కేంద్రం కఠిన చట్టాలు తెచ్చినా, వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. నిరసనలో లోక్‌సత్తా పార్టీ నేతలు జగన్, భవాని, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతినిధి రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేటలో వ్యక్తి అనుమానాస్పద మృతి

అమీర్‌పేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ సమీపంలోని ఓ విద్యాసంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వ్యక్తి బల్కంపేటలోని తన గదిలో మృతిచెందాడు. ఎస్సార్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా, సంఘం మండలం, సిద్ధిపురం గ్రామానికి చెందిన ఆత్మకూరి విజయ్ కుమార్ (52) ఒంటరిగా ఉంటూ జీవన్ జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బల్కంపేటలోని సిరి ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో వాచ్‌మన్ ఫ్లాట్ యజమాని మధుసూదన్‌గౌడ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా విజయకుమార్ మృతిచెంది కనిపించాడు. ల్యాప్‌టాప్ ముందు కూర్చుని పని చేసుకుంటూ నాలుగైదు రోజుల కిందట మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వజ్రపు చెవి కమ్మలు చోరీ

బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వజ్రపు చెవి కమ్మలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డునంబర్.14 బీఎన్‌రెడ్డికాలనీలో నివాసముండే నిఖిత కజా గృహిణి. ఈ నెల 6న బయటకు వెళ్తూ వజ్రాలు పొదిగిన బంగారు చెవి కమ్మలు ధరించింది. తిరిగి వచ్చాక వాటిని కబోర్డులో పెట్టింది. ఈనెల 18న కబోర్డులో చూడగా కనిపించలేదు. ఇల్లంతా వెతకడంతో పాటు పనిమనుషులను కూడా అడిగింది. దొరకపోవడంతో ఈనెల 20న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌సంస్థల్లో ప్రమోషన్లను రెగ్యులర్ చేయాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌సంస్థల్లో కాన్సిక్వెన్షియల్ సీనియార్టీలో వచ్చిన ప్రమోషన్లను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీఎస్టీ ఉద్యోగ సంఘం డిమాండ్ చేసింది. విద్యుత్‌సంస్థల్లో అమలు చేస్తున్న రోస్టర్ విధానాన్ని అమలు చేయకపోవడానికి ఏర్పడిన పరిస్థితులను నిరసిస్తూ బుధవారం సోమాజిగూడలోని విద్యుత్‌సౌధలో ఉద్యోగులతో నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామనోహర్, సెక్రటరీ మేడి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో లేకుండా 2021లో దొడ్డిదారిన ఇచ్చిన టీఓఓ 954 దాని అనుబంధ కంపెనీల ఆర్డర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో వచ్చిన పోస్టుల్లో సీనియార్టీని రోస్టర్ విధానంలో నిర్ణయించి ఇచ్చిన అడ్‌హక్ ప్రమోషన్లను రెగ్యులర్ చేసి ఓటీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, ఇతర ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. టీజీఓఓ 62ను వెంటనే రద్దు చేసి సీనియార్టీ లిస్టులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌సంస్థల్లోని 23 వేల మంది ఆర్టిజన్లకు ఏపీటీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎన్.సోమ్లానాయక్, శ్రీహరి, ఎం.రవీందర్, ఆర్.శ్యాంకుమార్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామనోహర్, పక్కన మేడి రమేష్ తదితరులు

మోడల్‌స్కూల్ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్‌ను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఉపాధ్యాయులు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 12 ఏళ్ల నుంచి ఎందుకు ప్రమోషన్ ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. టీజీటీలను జూనియర్ లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి.కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్ మాట్లాడుతూ సర్వీసులో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే నియామక పరీక్ష ద్వారా ఎంపికై ఆలస్యంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వేతన వత్యాసాలు తొలగించేందుకు నోషనల్ సర్వీస్ కల్పించాలన్నారు. నిరాహార దీక్షలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి, కోశాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సామూహిక నిరాహారదీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కలుషిత జలాలు తాగిన బర్రెలు మృత్యువాత

● పీసీబీ కార్యాలయం ఎదుట గడ్డిపోతారం గ్రామస్థుల ధర్నా



బర్రెల కళేబరాలతో పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గడ్డిపోతారం గ్రామస్థులు

సనత్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను చెరువులో కలపడం వల్ల చెరువునీరు కలుషితమైందని, ఈ నీరు తాగిన పశువులు మరణించాయని, ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డిపోతారం గ్రామస్థులు సనత్‌నగర్ పీసీబీ కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మరణించిన బర్రెల కళేబరాలను తీసుకువచ్చి నిరసన తెలిపారు. అనంతరం పీసీబీ సభ్యకార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గడ్డిపోతారం గ్రామ పరిధిలోని వివిధ పరిశ్రమల నుంచి కాలుష్య రసాయనాలు వర్షం నీటిలో కలిశాయి. వర్షంనీరు కిష్టాయిపల్లిలోని మల్లెలచెరువులోకి చేరాయి. గత రెండు రోజులుగా చెరువులోని కలుషితనీరు తాగిన జీవాలు మృత్యువాత పడుతున్నాయి. కిష్టాయిపల్లికి చెందిన బాశెట్టిగారి సాయికిరణ్‌కు చెందిన 10 బర్రెలు ఈ చెరువులో నీరు తాగాయి. కలుషిత నీరు తాగిన కారణంగా ఏడు బర్రెలు చనిపోయాయి. మరో 3 బర్రెలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. సాయికిరణ్‌కు దాదాపు రూ. 30 లక్షల నష్టం వాటిల్లిందని, పీసీబీ అధికారులు న్యాయం చేయాలని కిష్టాయిపల్లి మాజీ సర్పంచ్ పులిగెల ప్రకాశంచారి డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువు

చార్మినార్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదులకు రక్షణ కరువైందని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆగస్టు 24న సిటీ సివిల్ కోర్టులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కోర్టు ప్రాంగణంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల బోరబండ, సిద్దిపేట, జనగామలో వరుసగా న్యాయవాదులపై పోలీసుల దాడులు జరిగాయని, ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జిల్లాల్లోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు బర్కా రాజేష్‌కుమార్, సుధాన్సు, విశాల్‌సింగ్, ప్రవీణరెడ్డి, జశ్వంత్ కౌర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ చెల్లదు

● సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ భారత్ బంద్

బంజారాహిల్స్/ఎర్రగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లో భారత్ బంద్ నిర్వహించారు. స్థానికంగా ఉన్న దుకాణాలను, పెట్రోల్ బంక్‌ను మూయించారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. దళితులను విడదీసేందుకు బీజేపీ, మందకృష్ణ మాదిగ వర్గీకరణ అంశాన్ని తెర మీదకు తెచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, తులసి రాజలింగం, రాజు, సుమన్, మధు పాల్గొన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన ఎస్సీ వర్గీకరణ ఎప్పటికీ చెల్లదని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నాను అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎర్రగడ్డలో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మాల సంఘాల నాయకులు తలారి గోపాల్, చంద్రశేఖర్, పేగడ ఆకాష్, బబ్లు, శశి కుమార్, భాస్కర్, రామచందర్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాల వెలుగు సంఘం నాయకులు



భారత్ బంద్ నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కంటోన్మెంట్‌లో తీరనున్న నీటి కష్టాలు

- మరో గ్యాలన్ నీటి విడుదలకు మెట్రోవాటర్ బోర్డు అంగీకారం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజలకు శుభవార్త. కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న తాగునీటి కష్టాలు కొంతమేర తీరనున్నాయి. పెరిగిన జనాభా అవసరాలకు తగ్గట్టు అదనపు నీటిని విడుదల చేయడానికి మెట్రో వాటర్ బోర్డు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ కలిసి విన్నవించడంతో ఈమేరకు ఆదేశాలను వాటర్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి జారీ చేశారు. కేంద్ర రక్షణ శాఖ ఆధీనంలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సొంత నీటి సరఫరా వ్యవస్థ ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని మిగతా ప్రాంతాల్లో మాదిరిగా కంటోన్మెంట్‌లో వాటర్ బోర్డు ద్వారా నీటి సరఫరా జరగదు. మెట్రో వాటర్ బోర్డు నుంచి మంచినీటిని కొనుగోలు చేసి స్థానిక ప్రజలకు కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం సరఫరా చేస్తుంది. మెట్రో వాటర్ బోర్డు నుంచి కొనుగోలు చేసే మంచినీటిని సొంత వాటర్ రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లకు తెప్పించుకుని, అక్కడి నుంచి ప్రజలకు నీటిని సరఫరా చేస్తుంది. కాగా ప్రస్తుతం రోజుకు 6 మిలియన్ గ్యాలన్ల నీటిని మెట్రో వాటర్ బోర్డు ద్వారా కంటోన్మెంట్‌కు వస్తోంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటిని సరఫరా చేయాలని, మరికొంత పరిమాణం పెంచాలని కంటోన్మెంట్ బోర్డు చాలా కాలంగా విజ్ఞప్తి చేస్తోంది. అయితే అదనపు నీటిని విడుదల చేయడానికి అదనపు కనెక్షన్ చార్జీలు చెల్లించాలంటూ మెట్రో వాటర్ బోర్డు ఇన్నాళ్లూ షరతులు పెట్టింది. ఫలితంగా అదనపు నీటి విడుదల ఎప్పటికప్పుడు పెండింగ్ పడుతూ వచ్చింది. తాజాగా రేవంత్‌రెడ్డిని శ్రీగణేష్ కలిసి కంటోన్మెంట్ ప్రజల సమస్యలు ముఖ్యంగా నీటి ఎద్దడి గురించి వివరించడం, రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంతో సమస్య పరిష్కారమైంది. మరో గ్యాలన్ నీటిని విడుదల చేయడానికి వాటర్ బోర్డు అంగీకరించింది. ఇదిలా ఉండగా ఎలాంటి అదనపు కనెక్షన్ చార్జీలు చెల్లించనవసరం లేకుండా మెట్రోవాటర్ బోర్డు అదనపు గ్యాలన్ నీటిని విడుదల చేస్తున్నదని శ్రీగణేష్ వెల్లడించారు. కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చొరవ చూపుతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



వారాసిగూడ చౌరస్తాలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ కందిశైలజ తదితరులు

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను ఉరి తీయాలి

- కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం వారాసిగూడ చౌరస్తాలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌమిత, ఎలిజబెత్, నాయకులు శ్రీకాంత్, బెజ్జంకి రాజేష్, గంగాపురం ఆంజనేయులుగౌడ్, బాబా తదితరులు పాల్గొన్నారు. జూనియర్ డాక్టర్‌పై దారుణ ఘటనకు నిరసనగా మేడిబావి జ్యోతిమోడల్ హైస్కూల్ విద్యార్థులు భారీఎత్తున ర్యాలీని నిర్వహించారు. మేడిబావి నుంచి సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుధారాణి, కరస్పాండెంట్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రైల్వే సంచాలన్ భవన్ వద్ద ర్యాలీ నిర్వహించిన రైల్వే మహిళా ఉద్యోగులు

మహిళలపై దాడులు అమానుషం

- సి.హెచ్.శంకర్ రావు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే యూనియన్ కార్యాలయం నుంచి సంచాలన్ భవన్ కార్యాలయం వరకు రైల్వే మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రైనీ డ్యూటీ డాక్టర్‌పైన దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ కో-ఆర్డినేటర్ జోనల్ కోశాధికారి సరోజనీరెడ్డి, అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర్, డివిజన్ కార్యదర్శులు రవీందర్, సంజీవయ్య, కృష్ణ, బుచ్చిరెడ్డి, డివిజనల్ అధ్యక్షుడు ఖాజాబాబా, వరప్రసాద్, మంజులత, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శి నాగలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

మారేడుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించిన మత్తులో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.... పికెట్ లక్ష్మీనగర్ బస్తీలో నివాసముంటున్న పి.కృష్ణ(26) టైల్స్ దుకాణంలో లేబర్‌గా పని చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన యువతితో ప్రేమ వివాహం చేసుకొని అత్తగారింట్లోనే ఉంటున్నాడు. వివాహం జరిగి 8 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ సంతానం కలుగకపోవడంతో మద్యానికి బానిస అయ్యాడు. దీంతో మానసిక ఆందోళనకు గురైన కృష్ణ బుధవారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో ఇంట్లో రేకుల షెడ్డుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంతానం కలుగలేదన్న కారణంతో ఉరివేసుకున్నట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణం చేస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు కాజేసిన ఓ నిందితుడికి సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.200లు జరిమానా విధించింది. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 డిసెంబరు మాసంలో అశోక్, కనకమహాలక్ష్మి భార్యాభర్తలు కలిసి నిజామాబాద్ నుంచి కాచిగూడ వైపు రైలులో ప్రయాణం చేస్తున్నారు. ఈ రైలు సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ వరకు రాగానే కిటికీలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు తెంచుకొని పారిపోయాడు. బాధితురాలి మెడకు తీవ్ర గాయం ఏర్పడడంతో వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా నిందితుడు దినేష్(26) ఖాట్మండుకు చెందిన వాడిగా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన అనంతరం, కేసులో సమగ్ర విచారణ జరిపి రైల్వే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన రైల్వే కోర్టు న్యాయమూర్తి నిందితుడు ఎండీ గౌస్‌బాషాకు ఏడాది జైలు శిక్ష విధించి రెండు వందల నగదు జరిమానా విధించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహంపై ఉన్న గాయాలు

బౌద్ధనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో గాంధీ ఆస్పత్రి సమీపంలో బోయగూడ మెట్రోపిల్లర్ నెంబర్ 1015 వద్ద క్యాథలిక్ శ్మశానం వెనుక ఓ వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడని స్థానికులు 100కు డయల్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి తల రక్తపు మడుగులో ఉండటంతో పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వయసు 45 నుంచి 50సంవత్సరాలుంటాయని, లైట్‌బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని పోలీసులు తెలిపారు. ముస్లిం వ్యక్తిగా పోలీసులు అనుమాననిస్తున్నారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించి ఎవరైనా ఉంటే 87126 61252, 87126 61050 ఫోన్ చేసి చిలకలగూడ పోలీసులకు సమాచారమందించాలని కోరారు.



హోర్డింగ్ మీద పడి గాయాలు కావడంతో మహిళను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న బీజేపీ నాయకులు

హోర్డింగు మీద పడి మహిళకు గాయాలు

తిరుమలగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం సికింద్రాబాద్ బాలంరాయ్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున గార్డెన్ ముందు హోర్డింగులు ఏర్పాటు చేశారు. గార్డెన్ ముందు 6, 20 నిడివి గల హోర్డింగును ఏర్పాటు చేశారు. గాలికి హోర్డింగ్ విరిగి విద్యుత్ తీగలపై పడటంతో అటుగా నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. అక్కడే ఉన్న బీజేపీ శ్రేణులు హోర్డింగును పైకి లేపి మహిళను ఆస్పత్రికి తరలించారు.



రౌండ్ టేబుల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులకు రక్షణ కరువైంది

- సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్

చార్మినార్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదులకు రక్షణ కరువైందని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆగస్టు 24న సిటీ సివిల్ కోర్టులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కోర్టు ప్రాంగణంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల బోరబండ, సిద్దిపేట, జనగామలో వరుసగా న్యాయవాదులపై పోలీసుల దాడులు జరిగాయని, ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జిల్లాలలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు, బర్కా రాజేష్ కుమార్, సుధాన్షు, విశాల్ సింగ్, ప్రవీణరెడ్డి, జశ్వంత్ కౌర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు,



నిరాహారదీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్‌ను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఉపాధ్యాయులు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 12ఏళ్ల నుంచి ఎందుకు ప్రమోషన్ ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. టీజీటీలను జూనియర్ లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి.కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్ మాట్లాడుతూ సర్వీసులో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే నియామక పరీక్ష ద్వారా ఎంపికై ఆలస్యంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వేతన వ్యత్యాసాలు తొలగించేందుకు నోషనల్ సర్వీస్ కల్పించాలన్నారు. నిరాహార దీక్షలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.జంగయ్య చావ రవి, కోశాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తార్నాకలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి తార్నాకలో పర్యటించిన డిప్యూటీ మేయర్ విద్యుత్ వైర్లకు, వీధి దీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జలమండలి అధికారులతో కార్పొరేటర్ సమావేశం

బౌద్ధనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో బుధవారం జలమండలి అధికారులతో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ సమావేశమయ్యారు. ఇటీవల బస్తీల్లో పర్యటించినప్పుడు స్థానికులు తీసుకువచ్చిన సమస్యలను కార్పొరేటర్ అధికారులకు వివరించారు. పలు ప్రాంతాల్లో లోప్రెషర్ వాటర్ వస్తుందని, ఓవర్ ఫ్లో, మ్యాన్‌హోల్స్ పర్యవేక్షణ సరిగ్గా లేదని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. బ్రాహ్మణబస్తీ, వెంకటేశ్వర నగర్‌లో ఆగిపోయిన పనులకు మళ్లీ రీ టెండరింగ్ వేసి ప్రపోజల్స్ పెట్టాలని అధికారులకు సూచించారు. జలమండలి మేనేజర్ ప్రియాంక, శ్రీకాంత్, నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించి నూతన గృహాలను నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన ఐడీహెచ్ కాలనీవాసులు

పద్మారావునగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలుతాయో తెలియని ఇబ్బందికర పరిస్థితులలో నివసిస్తున్న తమను ఆదుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఐడీహెచ్ కాలనీవాసులు కోరారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడీహెచ్ కాలనీలోని జేఎన్‌నర్మ్ ఇళ్లకు చెందిన నివాసితులు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజుతో కలిసి బుధవారం మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. దాదాపుగా 20 సంవత్సరాల క్రితం జెఎన్‌నర్మ్ పథకం కింద ఇళ్లను నిర్మించారని, వాటిలో 4,5,6,10 బ్లాకలలోని 144 ఇళ్ల పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించి, వాటి స్థానంలో నూతనంగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తలసానికి విజ్ఞప్తి చేశారు. ఆయన త్వరలోనే అధికారులతో కలసి పర్యటించి నిర్ణయం తీసుకొంటానని వారికి హామీనిచ్చారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఓపెన్ జిమ్ ప్రారంభించి అనంతరం మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చిలకలగూడ, పద్మారావునగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మనిషి జీవన విధానం మారటం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని, క్రమం తప్పకుండా వ్యాయామంతో అధిగమించవచ్చునని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బన్సీలాల్ పేటలోని పద్మారావు నగర్, న్యూమెట్టుగూడలో బుధవారం ఓపెన్ జిమ్‌లను లాంఛనంగా ప్రారంభించి అనంతరం మాట్లాడుతు ఆహారపు అలవాట్లు, కలుషిత నీరు, వాతావరణ కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని, డాక్టర్లు క్రమం తప్పకుండా నడక, వ్యాయామం చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాల ఆలోచనలు మారాలని, విద్యార్థులకి పాఠశాలల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించి, ఆటపాటలతో మానసిక ఉల్లాసం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో ఆట స్థలాలు లేవని భవిష్యత్‌లో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 40 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామని, జీహెచ్ఎంసీ వద్ద నిధులు లేని కారణంగా ప్రయివేటు వ్యక్తుల ఆర్థిక సహకారంతో జిమ్స్ ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరో వైపు హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించే పబ్లిక్ టాయిలెట్లు అధ్వానంగా మారాయని, సులభ్ వంటి సంస్థల ఆధ్వర్యంలో బాగానే నడుస్తున్నప్పటికీ ప్రభుత్వం చొరవ తీసుకుని ఎన్జీఓలు ప్రయివేటుగా టాయిలెట్లు నిర్మించి నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని, తగినన్ని పబ్లిక్ టాయిలెట్లు లేని కారణంగా రోడ్డు ప్రక్క పరిసరాలు అపరిశుభ్రంగా మారటం వల్ల ఆరోగ్యసమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పద్మారావు నగర్ పార్కు అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ నడక, యోగా, లాఫింగ్ క్లబ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని, ఓపెన్ జిమ్ ఏర్పాటు వల్ల ఎంతో ఉపయక్తుంగా పార్కు మారుతుందని, సద్వినియోగం చేసుకోవాలని ఏర్పాటుకి కృషి చేసిన కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, అధికారప్రతినిధి శారద మల్లేష్, సీనియర్ పాత్రికేయులు ఇ.చంద్రశేఖర్, నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, నేతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌కు కిషన్‌రెడ్డి అభినందన



నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీతో కుమారి నిధివర్మ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

పద్మారావునగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కరాటే చాంపియన్ నిధివర్మను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి పద్మారావునగర్ జీహెచ్ఎంసీ పార్కులో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్‌రెడ్డిని, బెంగుళూరులో ఆగస్టు 4న జపాన్ కరాటే షోటోకన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ నేషనల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలలో చాంపియన్‌షిప్ సాధించిన నిధి వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ఆమెను అభినందించి, భవిష్యత్‌లో ఎన్నో పతకాలు సాధించి, దేశం గర్వించేలా ఎదగాలన్నారు. నిధి వర్మ మాట్లాడుతూ... తన విజయానికి అత్యుత్తమ శిక్షణను, ప్రోత్సాహన్ని అందించిన కోచ్ గోపాల్‌రెడ్డి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సెయింట్ సాయి స్కూల్ కరస్పాండెంట్ ఎస్.శివరామకృష్ణ, ఉమేశ్ ఖండేల్‌వాల్, సురేశ్ పాల్గొన్నారు.



వయోవృద్ధుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జే.రామకృష్ణ

సీనియర్ సిటిజన్స్ మార్గంలో యువత నడుచుకోవాలి

- నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

తిరుమలగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు తమ అనుభవాలను నేటి యువతకు బోధించవలసి ఉందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మొబిలిటీ ఇండియా ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ తిరుమలగిరి బంజారానగర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోవృద్ధులు తరాలకు వారసులని వారు జ్ఞానం, సంస్కృతి, సంపద సాంప్రదాయాలను ఒక తరం నుంచి మరో తరంకి పంచుతున్నారని, వారి బాగోగులు మన అందరి బాధ్యత అని అన్నారు. వయోవృద్ధులు వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు మొబిలిటీ ఇండియా ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ గుర్తించి ఆ వయసులో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వృద్ధులకు వివరించారు. మొబిలిటీ ఇండియా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వృద్ధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బంజారానగర్ కాలనీ ప్రతినిధులు వై.వి.రావు, లింగమూర్తి, బోస్, చిన్నికృష్ణ బాబు, మొబిలిటీ ఇండియా ఏజీఎం సోము, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు నిర్వహిస్తున్న వైద్యపరీక్షలు

ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో .. వయోవృద్ధులకు వైద్యపరీక్షలు

సికింద్రాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ రాష్ట్రంలో విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శిబిరాల్లో భాగంగా బుధవారం కంటోన్మెంట్‌లోని బోయినపల్లి వార్డు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసింది. వృద్ధాప్య సమస్యలు, మధుమేహం, మోకాలి నొప్పులు, నడుము నొప్పులు తదితర సమస్యలతో బాధ పడుతున్న వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అటవీ శాఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ పార్వతి నాయకత్వంలో వైద్య పరీక్షలు జరిపారు. ఫార్మసిస్ట్ వినోదారాణి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయుష్ జిల్లా ప్రోగ్రాం అధికారి వరకాల శ్రావణ్‌కుమార్, ఏఎన్ఎం స్వరూప, ఆశా వర్కర్స్ దివ్య, గుణసుందరి తదితరులు పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు తీర్పునకు నిరసనగా జేబీఎస్ చౌరస్తా వద్ద మాల మహానాడు నాయకుల ధర్నా

రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీర్పునివ్వడం బాధాకరం

- పిల్లి సుధాకర్

మారేడుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు తీర్పునివ్వడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈమేరకు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆర్టీసీ బస్సులను జేబీఎస్‌లో నుంచి బయటకి వెళ్లకుండా అడ్డుకున్నారు. పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీర్పునివ్వడం బాధాకరమని ఆయన అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నిస్తే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని, దీనిని ప్రతిఘటించేందుకు రాజకీయ, న్యాయ పోరాటాలు చేసేందుకు మాల కులస్తులు సిద్ధంగా ఉండాలని సుధాకర్ పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమం చేపట్టిన పలువురు నేతలను మారేడుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు.

తుకారాంగేట్‌లో..

అడ్డగుట : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం తుకారాంగేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ నేతలు నిరసన వ్యక్తం చేస్తూ భారత్ బందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు శ్రీరాం, రాష్ట్ర నాయకుడు కృష్ణ, సికింద్రాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు బక్కూరి నర్సింగ్‌రావు, రామలీల, కరుణాకర్, జయకుమార్, రమేష్ జయ్‌రాంలు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాల ఉపాధ్యక్షుడిగా సనాధన్ నియామకం



యు.సనాధన్

అడ్డగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తుకారాంగేట్ మరాఠ బస్తీకి చెందిన యూ.సనాధన్ నియమితులయ్యారు. ఈ సంఘం జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కులస్థులకు అండగా ఉంటూ తమ హక్కు కోసం పోరాటం చేస్తామన్నారు.

నేడు శ్రీలలితా త్రిపుర సుందరి దేవి దేవాలయానికి భూమి పూజ

తిరుమలగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్‌బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ దేవాలయంలో నేడు గురువారం ఉదయం 9గంటలకు శ్రీలలితా త్రిపుర సుందరిదేవి ఉప ఆలయానికి భూమి పూజ జరుగుతుందని ఈఓ మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. దేవాలయం నిర్మాణానికి పర్వనిరంజన్, ఆయన సతీమణి పర్వ వెంకటరమణలు సాకారం అందిస్తున్నారని తెలిపారు. అమ్మవారి సేవలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని సూచించారు.